ఆకాశవాణి, హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 27.08.2024 సమయం: 1310 గంటలు

ముఖ్యాంశాలు

1. రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈరోజు నుంచి మూడు రోజుల పాటు ఉమ్మడి నల్లగొండ, వరంగల్ జిల్లాలో పర్యటిస్తున్నారు. ఈ ఉదయం గవర్నర్ యాదాద్రి శ్రీ లక్ష్మి నరసింహస్వామిని దర్శించుకున్నారు.
2. రాష్ట్రంలో క్రీడల ప్రోత్సాహానికి నిధుల కొరత లేదని, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. హైదరాబాద్ LB స్టేడియంలో ఉద్యోగుల క్రీడా పోటీలను ఉప ముఖ్యమంత్రి ఈ ఉదయం ప్రారంభించారు.
3. హైదరాబాద్ లో గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేలా వివిధ శాఖలు సమన్వయంతో పని చేయాలని హైదరాబాద్ ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ , అధికారులను ఆదేశించారు.
4. ఏజెన్సీ ప్రాంత ప్రజల హక్కుల పరిరక్షణకు వీలు కల్పించే 1 ఆఫ్ 70, జి.ఓ నెంబర్ 3 అమలు ను కోరుతూ, ఈరోజు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఏజెన్సీ ప్రాంతాలలో ఆదివాసీ సంఘాల పిలుపుమేరకు బంద్ కొనసాగుతోంది.

గవర్నర్ పర్యటన....

రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈరోజు నుంచి మూడు రోజుల పాటు ఉమ్మడి నల్లగొండ, వరంగల్ జిల్లాలో పర్యటిస్తున్నారు. ఈ ఉదయం గవర్నర్ యాదాద్రి భువనగిరి జిల్లా యాదాద్రి, శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. యాదాద్రి కొండపైకి చేరుకున్న గవర్నర్ కు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, దేవాదాయశాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్, ఆలయ ఈవో స్వాగతం పలికారు. రాష్ట్ర గవర్నర్ గా బాధ్యతలు చేపట్టిన తర్వాత గవర్నర్, తొలిసారి యాదగిరిగుట్ట పుణ్యక్షేత్రాన్ని దర్శించారు. ఆలయం లో పూజలు చేసిన తర్వాత గవర్నర్, జనగామ, ములుగు వరంగల్ జిల్లాల పర్యటనకు వెళ్లారు. ఈ మధ్యాహ్నం ములుగుకు చేరుకున్న గవర్నర్ కు జిల్లా కలెక్టర్, ప్రజాప్రతినిధులు స్వాగతం పలికారు. జిల్లా ఉన్నతాధికారులతో ప్రత్యేక సమావేశం అనంతరం జిల్లా లోని కవులు, కళాకారులతో గవర్నర్ సమావేశం కానున్నారు. అనంతరం గవర్నర్ యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయంతో పాటు, భూపాలపల్లి జిల్లా లోని కోటగుళ్లు, ములుగు జిల్లా లక్నవరం సరస్సును సందర్శించనున్నారు

పిటిసి, యాదాద్రి భువనగిరి

క్రీడలు-ఉపముఖ్యమంత్రి

రాష్ట్రంలో క్రీడల ప్రోత్సాహానికి నిధుల కొరత లేదని, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. క్రీడల ద్వారా అందే స్ఫూర్తి జీవితంలో పెద్ద ఎత్తున ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ LB స్టేడియంలో ఉద్యోగుల క్రీడా పోటీలను ఉప ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రపంచ క్రీడా పోటీల్లో తెలంగాణ ప్రాతినిధ్యానికి, బంగారు పతకాలు సాధించేందుకు స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో తప్పనిసరిగా ఒక పీరియడ్ క్రీడలు ఉండేలా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని పేర్కొన్నారు.

హైదరాబాదులో ప్రసిద్ధ క్రీడా పోటీలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందనీ, ఇందుకు అవకాశం ఇవ్వాలని ఇటీవల కేంద్రప్రభుత్వానికి కూడా విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. ఇప్పటికే ఉన్న క్రీడా సముదాయాలను మరమ్మత్తులు చేసి అభివృద్ధి చేస్తామని కూడా ఉప ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.

MSL

జపాన్ విద్యార్థుల పర్యటన

మెదక్ జిల్లా కౌడిపల్లి మండలంలోని బుజురంపేట్ గ్రామంలో జపాన్ విద్యార్థుల బృందం పర్యటించింది. అక్కడి ప్రజల సంస్కృతి సాంప్రదాయాలను, ప్రజల జీవన విధానాన్ని జపాన్ విద్యార్థినీ విద్యార్థులు పరిశీలించారు. హైదరాబాదులోని కంది ఐఐటీ ఆధ్వర్యంలో జపాన్ సుజుకి సంస్థకు చెందిన 15 మంది విద్యార్థినీ, విద్యార్థులు ఈ పర్యటనలో పాల్గొన్నారు. భుజురంపేట మహిళా సంఘాల సభ్యుల స్థితిగతులు, వారి ఆర్థిక పరిస్థితులను వారు అడిగి తెలుసుకున్నారు. వీటితోపాటు గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి , గ్రామ పంచాయతి నుంచి వారు కోరుకుంటున్న సహాయ సహకారాల గురించి, అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఐఐటీ టీం లీడర్ రమాదేవి, జపాన్ విద్యార్థి బృందం రాఖి తదితరులు పాల్గొన్నారు.

పిటిసి, మెదక్

ఆర్టీసి..ఆసిఫాబాద్....

ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో, ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపో ఎదుట, జేఏసీ చైర్మన్ దివాకర్ ఆధ్వర్యంలో కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి ఈరోజు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగే ఉపేందర్ మాట్లాడుతూ, ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీని వెంటనే ప్రభుత్వంలో విలీనం చేయాలన్నారు. 2013 నుండి ఉన్న పెండింగ్ బకాయిలు చెల్లించాలన్నారు. కార్మిక సంఘాలను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

మంచిర్యాలలో...

ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో మంచిర్యాల ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు.ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయాలని, ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరించి..కార్మికులకు రావలసిన బాండ్ డబ్బులు వెంటనే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.

పిటిసి, ఆసిఫాబాద్, మంచిర్యాల

నిర్మల్ పారిశుధ్య సిబ్బంది

నిర్మల్ మున్సిపాలిటీ పారిశుధ్య సిబ్బంది నిన్నటి నుంచి విధులకు హాజరు కావడం లేదు. మూడు నెలలుగా తమకు వేతనాలు అందలేదని, అవి చెల్లించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఉదయం మున్సిపల్ చైర్మన్ రాజు, పారిశుధ్య కార్మికలుతో సంప్రదింపులు జరిపినప్పటికీ ప్రయోజనం లేకపోయింది.

పిటిసి, నిర్మల్

బెల్లంపల్లి తనిఖీలు

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణం, బూడిద గడ్డ బస్తీలో పోలీసులు ఈరోజు తనిఖీలు నిర్వహించారు. గంజాయి సరఫరా ను అరికట్టేందుకు, పలు ఇండ్లలో నార్కోటిక్ డాగ్ స్క్వాడ్ ద్వారా తనిఖీలు చేపట్టారు. అలాగే, ఈ తనిఖీల్లో సరైన ధ్రువపత్రాలు లేని 45 ద్విచక్ర వాహనాలు 1 ఆటో ను స్వాధీనం చేసుకుని పోలీసు స్టేషన్కు తరలించారు. ఈ సందర్భంగా ఏసిపి రవి కుమార్ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలను ఎప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని, యువత గంజాయికి బానిస కాకుండా చూడాలని కోరారు.

పిటిసి, మంచిర్యాల

గణేష్ ఉత్సవాలు:

హైదరాబాద్ లో ప్రతిష్టాత్మక గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేలా వివిధ శాఖలు సమన్వయంతో పని చేయాలని హైదరాబాద్ ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో ఈ ఏటి గణేష్ ఉత్సవాలు ఏర్పాట్ల పై మంత్రులు పొన్నం ప్రభాకర్ ,శ్రీధర్ బాబు సన్నాహక సమావేశం నిర్వహించారు. మేయర్ గద్వాల్ విజయ లక్ష్మి, నగర శాసనసభ్యులు పలువురు, ప్రజా ప్రతినిధులు, వివిధ గణేష్ ఉత్సవ సంఘాల ప్రతినిధులు, GHMC, హైదరాబాద్ జిల్లా అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా ప్రజలకు అవసరమైన ఏర్పాట్లు, ట్రాఫిక్ మళ్ళింపులు, భద్రత, నిమజ్జన ఏర్పాట్లు వంటి పలు అంశాలపై సమావేశంలో చర్చిస్తున్నారు.

MSL

ఏజెన్సీ బంద్....

ఆదివాసీ సంఘాల పిలుపు మేరకు ఈరోజు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఏజెన్సీ ప్రాంతాలలో బంద్ కొనసాగుతోంది. ఏజెన్సీ ప్రాంత ప్రజల పరిరక్షణకై ఉన్న పెసా చట్టం, జీవో నెంబర్ 3, వన్ ఆఫ్ 70 చట్టం సక్రమంగా అమలు చేయాలని, ఆదివాసి సంఘం తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ జిల్లాలో బంద్ జరుగుతోంది. జిల్లాలోని ఏజెన్సీ మండలాలైన తిర్యాని, కెరమెరి, జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్, వాంకిడి మండలాల్లో బంద్ ప్రభావం కనిపిస్తోంది. తుడుం దెబ్బ నాయకులు ఆయా మండలాల్లో రాస్తారోకోలు నిర్వహించారు. ఈ సందర్భంగా తుడుం దెబ్బ జిల్లా నాయకులు కొట్నాక విజయ్, కోవ విజయ్ లు మాట్లాడుతూ ఏజెన్సీ పరిరక్షణకై ఉన్న చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలన్నారు. లంబాడాలను ఎస్టీ జాబితా నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ... లంబడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని, ట్రైబల్ సబ్ ప్లాన్ ఏరియా పరిధిలోని 40 శాతం ఆదివాసి జనాభా ఉన్న గ్రామాలను ఏజెన్సీ ప్రాంతాలుగా గుర్తించాలని

కోరారు. ఏజెన్సీలో ప్రత్యేక డిఎస్సి ద్వారా ఉపాధ్యాయ పోస్ట్ లను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ బంద్ కు ఆదివాసి సంఘాలు, కోయ, మన్నేవార్, ఉద్యోగ, ఉపాధ్యాయ, మహిళా సంఘాలు మద్దతు తెలిపాయి. మంచిర్యాల జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో బంద్ కొనసాగుతోంది.

ఆసిఫాబాద్, మంచిర్యాల పిటిసి

సంగారెడ్డి- గంజాయి

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ సమీపంలోని మునిపల్లి గ్రామం వద్ద ఉన్న, కంకోల్, టోల్గేట్ వద్ద, ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ పోలీసులు ఒక కారు నుంచి 83.4 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ వేకువ జామున చెక్ పోస్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా దీనిని స్వాధీనం చేసుకున్నారు. చిత్తూరు జిల్లాకు చెందిన ఒక వ్యక్తి కారులో సీటు కింద, ప్రత్యేక విభాగంలో ప్యాకెట్ల రూపంలో గంజాయిని దాచి, మహారాష్ట్ర కు తరలించేందుకు ప్రయత్నించినట్టు పోలీసులు తెలిపారు. తాము స్వాధీనం చేసుకున్న 83.4 కేజీల గంజాయి విలువ 34.5 లక్షల రూపాయల వరకు ఉంటుందని పోలీసులు వెల్లడించారు.

పిటిసి, సంగారెడ్డి

కవిత

ఢిల్లీ మద్యం విధానం కేసులో అరెస్టయిన బి.ఆర్.ఎస్ ఎమ్.ఎల్.సి(MLC) కవితకు ఈరోజు సుప్రీంకోర్టులో బెయిల్ మంజూరైంది. ఈడి, సిబిఐ కేసులో బెయిల్ మంజూరు చేస్తూ... ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. సిబిఐ తుది ఛార్జ్ షీట్ దాఖలు చేసిందని, ఈడి దర్యాప్తు పూర్తి చేసిందని సుప్రీంకోర్టు ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. కవిత గత ఐదు నెలలుగా మద్యం విధానం కేసులో జైల్లో వున్నారు.

ఎస్.డి.పి

ఖమ్మం-దరఖాస్తులు

ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లిలోని కేంద్రియ విద్యాలయంలో రెండవ తరగతి  నుండి 8వ తరగతి వరకు ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కవీంద్ర రాయ్ తెలిపారు. గతంలో భర్తీ చేయగా మిగిలిన సీట్లలో ప్రవేశాలు కల్పిస్తామని, ఆసక్తి ఉన్న వారు ఈనెల 29లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశాల ప్రక్రియ న్యూఢిల్లీలోని కేంద్రీయ విద్యాలయ సంఘటన్ మారదర్శకాల మేరకు జరుగుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు

పిటిసి ఖమ్మం